క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

- ఎస్ఈసీ మెంబర్ వెన్నా హనుమారెడ్డి


వెన్నా హనుమారెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

మార్కాపురం టౌన్: తనపై నమ్మకంతో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమించారని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వెన్నా హనుమారెడ్డి పేర్కొన్నారు. ఆయనను సోమవారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి సన్మానించారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకునేందుకు సమష్టిగా కృషి చేద్దామని వెన్నా పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమణారెడ్డి, ఏడు కొండలు, చినబాబు, వెంకటేశ్వర్లు, వీరాస్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

12న రైతు సమస్యలపై జేవీవీ సదస్సు

గిద్దలూరు రూరల్: సాగునీరు లేక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక విశ్వ భారతి స్కూల్ ఆవరణలో ఈ నెల 12న జనవిజ్ఞాన వేదిక సదస్సు నిర్వహించనున్నట్లు జేవీవీ నాయకులు పి.స్వరూపారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలుగొండ పూర్తయ్యేనా తాగు, సాగు నీరు కష్టాలు తీరేనా, ఎన్నాళ్లీ వ్యవసాయం, నీరు కరువైంది, బతుకు బరువైంది, అన్నదాతకు ఆసరా ఏది అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాగునీటి సమస్యలపై మేధావి వర్గంతో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశానికి పూర్వ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి, మాజీ శాసనసభ మండలి సభ్యుడు కె.ఎస్. లక్ష్మణరావులతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

గిద్దలూరు రూరల్: పంచాయతీల్లో స్థానిక సమస్యల పరిష్కారంపై సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీఓ సీతారామారావు సూచించారు. మండలంలోని ముండ్లపాడు, కొమ్మునూరు గ్రామాల్లో సచివాలయాలను ఎంపీడీఓ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులు పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సిబ్బంది సత్వరమే స్పందించాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో గౌరవంగా మాట్లాడాలని స్పష్టం చేశారు.

విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం


ఆర్టీసీ బస్ పైభాగాన్ని తాకే స్థితిలో విద్యుత్ తీగలు

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురం నుంచి రాచర్ల మండలం సంగపేట వెళ్లే రోడ్డులో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. జేబీకే పురం పోలేరమ్మ ఆలయం సమీపంలో విద్యుత్ తీగలు సాగడంతో ఆర్టీసీ బస్ టాప్‌కు తగిలే ప్రమాదముందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులు, వర్షం పడే సమయంలో విద్యుత్ తీగలు బస్ టాప్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదముందని, తీగలను సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మునగపాడులో మోస్తరు వర్షం


మునగపాడు చౌడమ్మ వాగులో ప్రవహిస్తున్న నీరు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసింది. మునగపాడులో కురిసిన వర్షానికి చౌడమ్మ వాగు పొంగడంతో రహదారి పక్కనున్న కాలనీలోని నివాసాల్లోకి వర్షం నీరు చేరింది. గొట్లగట్టు ప్రాంతంలో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి కారుమబ్బులు కమ్ముకున్నాయి. దీంతో భారీ వర్షం పడుతుందని ఆశించిన ప్రజలు చిరుజల్లులతోనే సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. రబీ సీజన్ ప్రారంభం కావడంతో పలు గ్రామాల్లో వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

షాదీఖానా.. పూర్తయ్యేనా?

- ముస్లింల కల నెరవేర్చడంపై దృష్టి సారించని పాలకులు
- షాదీఖానా నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- కూటమి గద్దెనెక్కాక పూర్తిగా నిలిచిపోయిన నిర్మాణ పనులు
- షాదీఖానా పూర్తయితే 15 వేల మంది ముస్లింలకు ప్రయోజనం


అసంపూర్తిగా నిలిచిన షాదీఖానా భవన నిర్మాణ పనులు

మార్కాపురం:

ముస్లింలు వివాహాది శుభకార్యాలు, ఇతరత్రా సమావేశాలు నిర్వహించుకునేందుకు అవసరమైన షాదీఖానా నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే నిచిలిపోయిన షాదీఖానా పనులను కూటమి ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు అవుతున్నా ఏమాత్రం పట్టించుకోలేదు. 70 శాతం మేర పూర్తయిన పనులను అర్ధంతరంగా నిలిపేయడంపై ముస్లిం సామాజికవర్గం నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో శ్రీకారం

మార్కాపురం పట్టణంతోపాటు మండలంలో సుమారు 15 వేల మందికి పైగా ముస్లింలు ఉన్నారు. శుభకార్యాలతోపాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు శాశ్వత భవనం లేకపోవడంతో గత 20 ఏళ్లుగా షాదీఖానా కోసం ప్రయత్నాలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, విభజన అనంతరం ఏర్పాటైన టీడీపీ ప్రభుత్వంలో స్థానిక కంభం రోడ్డులో షాదీఖానా నిర్మాణానికి శిలాఫలకాలు ఆవిష్కరించారేగానీ పైసా నిధులు కేటాయించలేదు. అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యను వివరించారు. దీంతో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులను కేటాయించడం, టెండర్లు పిలవడం, పనులు ప్రారంభించడం చకచకా జరిగిపోయాయి. ప్రస్తుత మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సైతం షాదీఖానా నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి షాదీఖానా నిర్మాణ పనులను వేగవంతం చేయించారు. దీంతో 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ముస్లింల కల నెరవేరే దశలో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత షాదీఖానా నిర్మాణం పూర్తి చేస్తారని ఆశించిన ముస్లింలకు భంగపాటు తప్పలేదు. 15 నెలలు కావస్తున్నా భవన నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. షాదీఖానా నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

షాదీఖానా పూర్తయితే..

మార్కాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాలైన వేములకోట, చింతగుంట్ల, తిప్పాయిపాలెం, నికరంపల్లి, దరిమడుగు, రాయవరం, గజ్జలకొండ, ఇడుపూరుతోపాటు తర్లుపాడు పెద్దారవీడు మండలాల ముస్లింలు వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునేందుకు షాదీఖానా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం షాదీఖానా లేకపోవడంతో ముస్లింలు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అత్యధిక మొత్తంలో అద్దె చెల్లించి పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లను వినియోగించుకోవాల్సి వస్తోంది. షాదీఖానా పూర్తయితే తక్కువ అద్దెతో కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా షాదీఖానా నిర్మాణాన్ని పూర్తిచేయాలని ముస్లింలు కోరుతున్నారు.

త్వరగా పూర్తిచేయాలి



మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలి. పేద ముస్లింలు వివాహది శుభకార్యాలు చేసుకునేందుకు షాదీఖానా అవసరం. తక్కువ ఖర్చుతోనే షాదీఖానాలో కార్యక్రమాలు నిర్వహించుకునే వెసులుబాటు ఉంటే ఆర్థిక భారం తప్పుతుంది. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి.

– సయ్యద్ గౌస్ మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ వింగ్ రాష్ట్ర అధికార ప్రతినిధి

15 వేల మందికి ఉపయోగం



మార్కాపురం పట్టణ నడిబొడ్డున నిర్మాణంలో ఉన్న షాదీఖానా పనులు నిలిచిపోవడం బాధాకరం. వెంటనే పనులు ప్రారంభించి త్వరగా పూర్తిచేయాలి. షాదీఖానాను వినియోగంలోకి తీసుకొస్తే మార్కాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో ఉన్న సుమారు 15 వేల మంది ముస్లిం కుటుంబాలకు మేలు కలుగుతుంది.

– రఫీ, వైయస్సార్‌సీపి మైనార్టీ నాయకులు

ముస్లింల కోరిక నెరవేర్చండి



మార్కాపురం ప్రాంతంతోపాటు పరిసర గ్రామాల్లోని ముస్లింల చిరకాల కోరిక అయిన షాదీఖానా నిర్మాణాన్ని పూర్తి చేయాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భవనానికి శంకుస్థాపన చేయడంతోపాటు శ్లాబ్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. షాదీఖానా లేకపోవడంతో ముస్లింలు ఏ కార్యక్రమం నిర్వహించుకోవాలన్నా ప్రైవేట్ కల్యాణ మండపాలకు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

– ఆసీఫ్ ఖాన్, న్యాయవాది, మార్కాపురం

వెలగలపాయలో నీటి సమస్య పరిష్కారం


పైపులైన్‌కు మరమ్మతులు చేసిన ప్రదేశం

సాక్షి ఎఫెక్ట్..

అర్ధవీడు: మండలంలోని వెలగలపాయ గ్రామ పంచాయతీలో వారం రోజులుగా నీటి ఎద్దడి నెలకొంది. త్రీ ఫేజ్ డీప్ బోరు నుంచి ఓవర్ హెడ్ ట్యాంకుకు నీటిని సరఫరా చేసే పైపులైన్ పగిలిపోవడంతో సమస్య తలెత్తింది. ఈ విషయమై ఈ నెల 4వ తేదీన 'వెలగలపాయలో తాగునీటికి కటకట' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పైపులైన్‌కు మరమ్మతులు చేసి ఓవర్ హెడ్ ట్యాంకుకు తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

పొదిలి డిపోలో ప్రయాణికుల అవస్థలు


మార్కాపురం బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల తంటాలు


పొదిలి ఆర్టీసీ బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

- కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై ఆగ్రహం

పొదిలి: పొదిలి ఆర్టీసీ డిపోలో మౌలిక వసతులు కొరవడటంపై ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆర్టీసీ డిపోల్లో వసతులు మెరుగుపరిచే దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవటంతతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. బస్సులు సరిపడినన్ని లేకపోవడం, వందలాది మంది ప్రయాణికులు కనీసం కూర్చునేందుకు కూడా అవకాశం లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫ్యాన్లు సక్రమంగా పనిచేయకపోవడం, మంచినీరు అందుబాటులో లేకపోవడంతో పిల్లలు, వృద్ధులు విలవిల్లాడుతున్నారు. దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో సోమవారం కాలేజీలు, పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన ప్రయాణికులు, అలాగే ఉద్యోగులు, వ్యాపారులు, బంధువుల వద్దకు, స్వగ్రామాలకు వెళ్లేవారితో బస్టాండ్ ఆవరణ కిక్కిరిసిపోయింది. బస్సులు పొదిలి డిపోలోకి చేరుకునేటప్పటికే ప్రయాణికులతో కిటకిటలాడుతుండటంతో అప్పటికే నిరీక్షిస్తున్న వారు విధిలేని పరిస్థితిలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. అధికారులు స్పందించి అదనపు బస్సులు ఏర్పాటు చేయడంతోపాటు, బస్టాండ్‌లో అదనపు సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రాణం పోసే బండి.. నిర్లక్ష్యం ఎందుకండి?

- జీజీహెచ్‌లో నిరుపయోగంగా అంబులెన్స్
- మరమ్మతులపై దృష్టి సారించని అధికారులు


జీజీహెచ్‌లో చెట్టు కింద నిరుపయోగంగా అంబులెన్స్

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్ అధికారుల నిర్లక్ష్యానికి అంబులెన్స్ సాక్షిగా నిలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన సీఎస్ఆర్ ఇనిషేటివ్ పవర్‌గ్రిడ్ ఎస్ఆర్–1 ప్రతినిధులు సుమారు 40 లక్షల రూపాయల విలువచేసే అధునాతన అంబులెన్సును మూడేళ్ల క్రితం జీజీహెచ్‌కు అందించారు. కొద్దిరోజులు అంబులెన్స్‌ను వినియోగించిన ఆస్పత్రి అధికారులు అంతలోనే పక్కన పెట్టారు. కారణం తెలియదు కానీ అప్పటి నుంచి వినియోగించడం లేదు. జీజీహెచ్ ఆవరణలోని చెట్టు కింద పార్కింగ్ చేసిన అంబులెన్స్ క్రమంగా తుప్పు పడుతోంది. ప్రస్తుతం వైద్యశాలలో ఉన్న అంబులెన్స్‌లు బయటకు వెళ్లినప్పుడు రోగులు ప్రైవేట్ అంబులెన్స్‌లకు అధిక ధర చెల్లించాల్సి వస్తోంది. కొద్దిపాటి మరమ్మతులతో అంబులెన్స్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలొస్తున్నాయి.

పలువురికి స్వచ్ఛ అవార్డులు ప్రదానం


అవార్డు అందుకుంటున్న పొదిలి తహసీల్దార్


ఏపీఎం గోపాల కృష్ణ


అంగన్‌వాడీ కార్యకర్త కోటేశ్వరమ్మ


పారిశుధ్య కార్మికుడు నాగేశ్వరరావు

పొదిలి/కొనకనమిట్ల: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పలువురికి అవార్డులు ప్రదానం చేసింది. సోమవారం ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు చేతులమీదుగా వారు అవార్డులు అందుకున్నారు. పొదిలి నగర పంచాయతీ పారిశుధ్య కార్మికుడు గాలిముట్టి నాగేశ్వరరావుకు స్వచ్ఛ వారియర్, తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డికి స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర అవార్డు దక్కాయి. మూగచింతల గ్రామానికి బెస్ట్ కిచెన్ గార్డెన్ అవార్డు ప్రకటించగా వెలుగు ఏపీఎం గోపాలకృష్ణ అందుకున్నారు. కొనకనమిట్ల మండలంలోని తువ్వపాడు ఏడబ్ల్యూసీ అంగన్‌వాడీ కేంద్రానికి స్వచ్ఛ అవార్డు దక్కగా కార్యకర్త కె.కోటేశ్వరమ్మ మెమెంటో అందుకున్నారు. ఆమెను ఐసీడీఎస్ సీడీపీఓ సుధామారుతి, సూపర్‌వైజర్లు ప్రసన్న, సుభాషిణి అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6 వేల కోట్లు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

పొదిలి: రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు ఉంటే, రూ.400 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవటం సిగ్గుచేటని, ఇంకా రూ.6 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ విమర్శించారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. రామ్మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఒక వైపు పరీక్షల ఒత్తిడి, మరో వైపు ఫీజులు ఒత్తిడితో నలిగిపోతున్నారన్నారు. నిధులు విడుదల చేయకపోవటంతో కాలేజీ యాజమాన్యాలు అప్పుల్లో కూరుకుపోయి, సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేకపోతున్నామని బంద్‌కు పిలుపునిచ్చిన సంఘటనలు జరగటం దురదృష్టకరమన్నారు. నిధులు విడుదల చేయాలని రోడ్డెక్కిన విద్యార్థులను పోలీసులతో కొట్టించటం విద్యా రంగానికి మాయని మచ్చగా మిగిలిపోతుందన్నారు. విద్యార్థులు అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా విద్యా రంగ సమస్యలు ఆలకించేందుకు విద్యాశాఖ మంత్రి ఒక్క నిముషం కూడా సమయం కేటాయించలేకపోతున్నారని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లకు మెస్ చార్జీలు పెంచకపోవటం, బకాయిలు సకాలంలో చెల్లించకపోవటంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి మాట్లాడుతూ జిల్లా యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ గురించి పట్టించుకోవటం లేదన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం అర్ధాంతరంగా ఆపేసి పీపీపీ పద్ధతుల్లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వ పీజీ కాలేజీల్లో ఫీజుల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు సీహెచ్. వినోద్, విజయ్, సాయి, గంగాజీ కుమార్, దేవ తదితరులు పాల్గొన్నారు.

మూలమలుపు.. ప్రమాదాలకు నెలవు


మూలమలుపులో రోడ్డుపైకి పోసిన మట్టి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటసత్యమాంబదేవి ఆలయం సమీపంలో కంభం వెళ్లే మెయిన్‌రోడ్డు మూలమలుపు ప్రమాదకరంగా మారింది. మూలమలుపులో గృహ నిర్మాణదారుడు రోడ్డుపైకి మట్టితోలి చదును చేశాడు. దీంతో వేగంగా వెళ్లే ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని మూలమలుపులో వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

వన్యప్రాణుల రక్షణపై అవగాహన


బొమ్మిలింగంలో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

అర్ధవీడు: వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. వణ్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధవీడు మండలం నాగులవరం సెక్షన్ పరిధిలోని మాగుటూరు బీట్ పరిధిలో కళాజత బృందంతో అవగాహన కల్పించారు. డీఆర్ఓ మాట్లాడుతూ.. అడవిలో వన్యప్రాణులు, వృక్షాలను సంరక్షిస్తే జీవవైవిధ్యం మెరుగవుతుందని పేర్కొన్నారు. అడవులను కాపాడుకుంటే సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. కార్యక్రమంలో బీట్ అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

3 నెలలగా నిలిచిన ఆధార్ సేవలు


ఆధార్ సేవలు నిలిచిన కందులాపురం-2 గ్రామ సచివాలయం

కంభం: గడిచిన మూడు నెలలుగా కంభం మండలంలో ఆధార్ సర్వీసులు నిలిచిపోవడంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా సెలవులకు స్వగ్రామం వచ్చిన విద్యార్థులు సైతం ఆధార్ కార్డులో తప్పులను సవరించుకునేందుకు అవకాశం లేకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. సచివాలయంలో ఎక్కడా ఆధార్ సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండలంలోని పెద్దనల్లకాల్వ, కందులాపురం–2, కంభం–2 సచివాలయాల్లో ఆధార్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. రెండు నెలల క్రితం సచివాలయ ఉద్యోగుల బదిలీలు చేపట్టిన నేపథ్యంలో ఆధార్ సర్వీసులు అందించే డిజిటల్ అసిస్టెంట్లు వారి స్థానాల నుంచి మరో ప్రాంతానికి వెళ్లారు. ఆయా స్థానాల్లో చేరిన వారికి తిరిగి నూతన లాగిన్స్ ఇవ్వాల్సి ఉండగా ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదు. గతంలో పనిచేసిన సిబ్బంది కిట్లను తమ వెంట తీసుకెళ్లిపోవడంతో ఆధార్ సేవలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని సచివాలయాల్లో ఆధార్ సర్వీసులు అందించడానికి అథారిటీ లేని వారిని వేయడంతో అక్కడ వారు సేవలు అందించలేని పరిస్థితి. గతంలో మాదిరిగా పోస్టాఫీసులు, బ్యాంకుల్లో ఆధార్ సెంటర్లు లేకపోవడం, సచివాలాయాల్లో ఆధార్ సేవలు ప్రారంభం కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల్లో ఆధార్ సర్వీసులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com